సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం ı 29 ı జూలై ı 2024



సోమశిలలో 9.571 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 9.571 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.70,780
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,339
3 శాతం జీఎస్టీతో	రూ.6,529
సవర (8గ్రాములు)	రూ.52,232

గరిష్టం/కనిష్టం
37.0 /29.6

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. సాయంత్రం నుంచి వర్షం కురిసే అవకాశం. వాతావరణంలో తేమ 47 శాతం ఉంది.

న్యూస్‌రీల్

చెరువులో మట్టి తవ్వకాలపై దాడులు

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: ఆత్మకూరులోని రాయల కాలం నాటి మేజర్ చెరువులో టీడీపీ నేతలు మాఫియా తయారై విచ్చలవిడిగా మట్టి తవ్వేస్తున్నారు. రైతుల పొలాల పేరుతో అనుమతులు తీసుకుని ఇటుక బట్టీలకు, రియల్ వెంచర్లకు మట్టిని అమ్ముకుంటున్నారు. మూడు రోజులుగా చెరువులో మట్టిని యంత్రాలు పెట్టి టిప్పర్లతో రవాణా చేస్తున్న విషయంపై శనివారం సాక్షిలో 'మట్టి మాఫియా దందా' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో ఎట్టకేలకు అధికారులు శనివారం అర్ధరాత్రి మట్టి తవ్వకాలు జరుపుతున్న చెరువు ప్రాంతంలో దాడులు నిర్వహించారు. నీటిపారుదల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు ఒక్కసారిగా దాడులకు వెళ్లారు. అయితే అప్పటికే 'కొందరు' అధికారులు మట్టి తరలించే టీడీపీ నేతలకు ఉప్పందించడంతో నిమిషాల వ్యవధిలోనే అక్కడి వాహనాలను తరలించేశారు. దీంతో అధికారులు దాడులకు వెళ్లిన సమయానికి అక్కడ ఎలాంటి వాహనాలు లేవు.

వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై టీడీపీ నేతల దాడి

కోవూరు: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో తమపై పోస్టులు పెట్టాడని వైఎస్సార్‌సీపీ నేత ఇంట్లో కుటుంబ సభ్యులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి కోవూరులో జరిగింది. బాధితుల కథనం మేరకు.. కోవూరు కాపు వీధికి చెందిన మదిరి నవీన్‌కుమార్ వైఎస్సార్‌సీపీ నేతగా ఉన్నాడు. ఇటీవల ఎన్నికల సమయంలో టీడీపీ నేతలను ఉద్దేశిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఈ నేపథ్యంలో నవీన్‌కుమార్ ఇంట్లో లేడని తెలుసుకుని ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు ఇంత మల్లారెడ్డి, నేత టవికుమార్ తమ అనుచరులతో వెళ్లి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఈ ఘటనలో నవీన్‌కుమార్ తండ్రి మదిరి చంద్రశేఖర్, తల్లి కుమారి, తమ్ముడు విజయకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసుల అదుపులో శివకృష్ణ?

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో కీలక నిందితుడు శివకృష్ణను శనివారం రాత్రి హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళ్లితే కమిషనర్ల సంతకాల ఫోర్జరీ వ్యవహారంలో నాటి కమిషనర్ వికాస్‌మర్మత్ ఫిర్యాదు మేరకు నగర మేయర్ భర్త జయవర్ధన్‌తో పాటు ఆరుగురిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. నిందితులు పరారీలో ఉండడంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారంగా జయవర్ధన్ అతని వ్యక్తిగత సహాయకుడు శివకృష్ణ ఇటీవల చెన్నైలో ఉన్నారని సమాచారంతో పోలీసులు అక్కడకు వెళ్లగా త్రుటిలో తప్పించుకున్నారు. ఎట్టకేలకు శనివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో శివకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఫోర్జరీ కేసులో పాత్రధారులు, సూత్రధారులు ఎవరెవరు ఉన్నారనే విషయాలపై శివకృష్ణను పోలీసు అధికారులు రహస్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

చిక్కని చేప

- రెండు నెలల వేట విరామం తర్వాత దొరకని మత్స్య సంపద
- మత్స్యకారుల రెక్కల కష్టం కడలి పాలు
- తీరానికి చేరిన బోట్లు.. వలలు
- మత్స్యకార భరోసా అందక.. ఆకలి కేకలు
- జిల్లాలో గతేడాది 12,073 మందికి మత్స్యకార భరోసా అందించిన గత ప్రభుత్వం



అలల కడలిని మథనం చేసినా.. మెత్త చేప కూడా చిక్కలేదు. అపార మత్స్య నిధికి అలవాలమైన అగాధ జలనిధి సాగరం. మత్స్య పునరుత్పత్తికి రెండు నెలల విరామం తర్వాత ఉత్సాహంగా వేటకు వెళ్లిన మత్స్యకారులకు నిరాశే మిగులుతోంది. ఆశించిన మేర మత్స్య సంపద దొరక్కపోవడం.. కనీసం బోట్ల డీజిల్ ఖర్చులు కూడా రాక దిగాలుగా తీరానికి చేరుకుంటున్నారు. నానాటికీ కలుషితమవుతున్న సముద్ర జలాల్లో మత్స్య ఉనికి కరువవుతోంది. గత ప్రభుత్వ హయాంలో వేట సాగని కాలంలోనే వేటపై ఆధారపడిన కుటుంబాలకు ఏటా ఆర్థిక సాయం అందించింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా ఇవ్వలేదు. అటు వేట లేక.. ఇటు భరోసా లేక ఆకలి కేకలు వేస్తున్నారు.

కావలి: కడలి ఒడిలో చేపల వేటనే జీవనంగా మార్చుకున్న మత్స్యకారులు ఏడాదిలో పది నెలల పాటు సాగరాన్ని మథనం చేస్తారు. ఎగిసిపడే కెరటాలను అవలీలగా దాటి కడలిని సునాయాసంగా ఈదే వీరు.. బతుకు పోరాటంలో దశాబ్దాలుగా ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నారు. వేటే వీరి జీవనాధారం.. ఆ వేట ఆగితే.. ఆ పూట గడిచేది కడుభారం. ప్రకృతి విపత్తులు, ప్రభుత్వ విధించే వేట నిషేధం కాలంలో బతుకు జీవనం పెను సవాల్‌గా ఉంటుంది. అప్పుడు.. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఆదరణకు నోచుకోలే.. దళారుల దగ్గర అప్పులు తెచ్చుకుని గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాం ఐదేళ్లు ప్రశాంతంగా సాగిపోయిన వీరి జీవితం.. ఈ ఏడాది నుంచి కల్లోల జీవితాలను అనుభవిస్తున్నారు.

రెండు నెలల విరామం తర్వాత..

సముద్రంలో చేపల వేటనే జీవనోపాధిగా చేసుకుని తరతరాలుగా బతుకుతున్న మత్స్యకారుల రెక్కాల కష్టానికి ప్రతి ఫలం లభించడం లేదు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కావలి రూరల్ మండలం నుంచి తడ మండలం వరకు విస్తరించి ఉన్న బంగాళాఖాతం సముద్ర తీరం వెంబడి రెండు లక్షల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరు నిత్యం సముద్రంలో చేపల వేటతోనే తమ కుటుంబాలను పోషించుకుంటుంటారు. అయితే ఏటా రెండు నెలలు మత్స్య సంపద పునరుత్పత్తి కాలంగా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేటను ప్రభుత్వం నిషేధిస్తోంది. ఈ రెండు నెలల కాలంలో మత్స్యకారులు చేపలు వేటకు వెళ్లరు. సముద్రంలో చేపలు సంతానోత్పత్తి పెరగడంతో పాటు, అప్పటికే ఉన్న మత్స్య సంపద మరింతగా పెరుగుతోంది. అయితే సముద్ర తీరం వెంబడి ఏర్పాటవుతున్న పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య వ్యర్థాలను సముద్ర జలాల్లో వదిలేస్తుండడంతో మత్స్య ఉనికి కోల్పోతోంది. ఇదిలా ఉంటే.. మన మత్స్యకారుల జీవనోపాధికి గండి కొట్టేలా సముద్రంలో మత్స్యసంపదను తమిళ జాలర్లు ఊడ్చేస్తున్నారు. తమిళ జాలర్లు పెద్ద బోట్లలో భారీగా వేట సామగ్రితో ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు పక్కనే ఉన్న ప్రకాశం జిల్లా తీరంలో స్వైర విహారం చేస్తున్నారు. వీరి వద్ద సన్న పిల్ల సైజ్ నుంచి పెద్ద పెద్ద చేపలు పట్టగలిగే వలలు ఉండడంతో వీరు మత్స్య సంపదను కొల్లగొట్టడంతో మన మత్స్యకారులు లబోదిబోమంటూ అల్లాడిపోతున్నారు.

నిర్మానుష్యంగా సముద్ర తీరం

చేపలు వేట నిషేధం ముగిసిన తర్వాత స్థానిక మత్స్యకారులతో సందడిగా ఉండాల్సిన సముద్ర తీరం మత్స్యకారులు లేక నిర్మానుష్యంగా ఉంది.



వేటకు వెళ్లినా చేపలు పడకపోవడంతో వలల చిక్కులను ఒడ్డున తీసుకుంటున్న మత్స్యకారులు

రూ.20 వేలు ఇస్తామంటూ.. మౌనం



గత ప్రభుత్వంలో ఏటా మే నెలలోనే మత్స్యకార భరోసాగా రూ.10 వేలు పరిహారం అందజేస్తుంటే.. చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామంటూ హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి నెలన్నర దాటిపోయినా.. ఇంత వరకు మత్స్యకార భరోసాపై ఉలుకుపలుకు లేదు. తాజాగా సముద్ర జలాల్లో మత్స్య సంపద దొరకడం లేదు.. కనీసం ప్రభుత్వమైనా ఆదుకుంటుందా అంటే ఈ ఏడాదికి ఇస్తారో లేదో కూడా తెలియని పరిస్థితితో మత్స్యకారులు బతుకుదెరువు లేక అల్లాడుతున్నారు. మరో వైపు ఎలాంటి ఉపాధి మార్గం లేక ఆకలి కేకలు వేస్తున్నారు. మళ్లీ రుణదాతల వద్దకు పరుగులు తీస్తున్నారు.



వేట లేక ఒడ్డుకు చేరిన వలలు, పడవలు

సముద్రంలో చేపలు దొరకడం లేదు



సముద్రంలో ఎంత దూరం వెళ్లినా చేపలు ఉండడం లేదు. వలలను సముద్రపు నీటిలో వదిలి లాగడం వల్ల రెక్కల కష్టం తప్పా ఏమీ మిగలడం లేదు.

జాలయ్య, మత్స్యకారుడు, తుమ్మలపెంట

డీజిల్ డబ్బులు కూడా రావడం లేదు



అప్పోసప్పో చేసి డీజిల్ కొనుగోలు చేసుకొని సముద్రంపై చేపల వేటకు వెళ్తుంటే డీజిల్ అయిపోతుందే కాని చేపలు పడడం లేదు. తమిళ జాలర్లు వల్ల సముద్రంలో మత్స్య సంపద మాకు దొరకడం కష్టమైపోయింది.

పోలయ్య, మత్స్యకారుడు, అన్నగారిపాలెం

ఉదారంగా ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 169 కిలో మీటర్ల తీర ప్రాంతం 12 మండలాల్లో విస్తరించి ఉంది. కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో చేపలు వేట చేసి బతుకుతున్న మత్స్యకారులు రెక్కాడితే కాని డొక్కాడక వారి కుటుంబాలను పోషించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతూ అప్పుల పాలవుతున్నారు. గతంలో, ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ మత్స్యకారలను ఏనాడూ పట్టించుకోలేదు. గతంలో మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం పేరుతో అరకొరగా ఐదారు వేల మందికే అదీ కేవలం ఏటా రూ.4 వేల మాత్రమే సాయం అందించింది. ఈ సాయం కూడా ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. ఎంతో దరఖాస్తు చేసుకున్నా.. బుట్టదాఖలు చేసింది. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే వేట నిషేధ కాలంలో ఇచ్చే సాయాన్ని ఉదారంగా రూ.10 వేలకు పెంచారు. ఏటా మే నెల రెండో వారంలోనే వీరికి పరిహారాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే పరిస్థితి ఉండేది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో దాదాపు 15,050 తొలి ఏడాదిలో ఇస్తే.. ఆ తర్వాత ఈ సంఖ్య మరింతగా పెరిగింది. విభజిత జిల్లా పరిధిలోనూ గతేడాది 12,072 మందికి మత్స్యకార భరోసా గత ప్రభుత్వం అందించింది.

చేపలు వేటకు వెళ్లినా సముద్రంలో చేపలు లేకపోవడంతో రెక్కల కష్టానికి తగిన ప్రతిఫల లేకపోవడంతో మత్స్యకారులు సముద్ర తీరానికి రావడానికి కూడా ఇష్ట పడటం లేదు.

అధికారులూ.. ఈ మెట్లు కనపడవా?

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకే నోటీసులు

ఆత్మకూరు: ఎన్నికల వరకే రాజకీయాలంటూ నీతి పలుకులు పలికే టీడీపీ నేతలు కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారు. అధికారులను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. చేజర్ల మండలం తూర్పుకంభంపాడు గ్రామానికి చెందిన కృష్ణవేణి వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం నిర్వహించిందనే కక్షతో ఆమె ఇంటి మెట్లు, వాహనాలు వెళ్లే ర్యాంపు గ్రామ కంఠంలో నిర్మించారంటూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో నాలుగు రోజుల క్రితం ఆత్మకూరు ఆర్డీఓ కె.మధులత స్వయంగా వెళ్లి పరిశీలించి ర్యాంపు, మెట్లు తొలగించాలని కృష్ణవేణిని ఆదేశించిన విషయం తెలిసిందే. మూడు రోజుల వ్యవధిలో వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎంపీడీఓ పేరుతో ఆమెకు పంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసు అందజేశారు. అయితే గ్రామంలోని ప్రధాన రహదారిలో నిర్మించుకున్న పలువురు టీడీపీ వారికి చెందిన ఇళ్ల మెట్లు, ర్యాంపులు రోడ్డుపైకి వచ్చి ఉన్నాయి. ఇవి అధికారులకు కనిపించడం లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి చెందిన నేలకొండ శ్రీనివాసులు, రెడ్డిబత్తిన బాబుల్‌నాయుడు తదితరుల ఇళ్ల మెట్లు రోడ్డుపైకే వచ్చి ఉన్నాయి. ఈ ఇళ్లకు లేని అభ్యంతరం కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకే వర్తిస్తుందా? అని, అధికారులు అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.



ఆత్మకూరు: టీకేపాడులో రోడ్డులోకి ర్యాంపు, మెట్లు నిర్మించిన టీడీపీ నాయకుల ఇళ్లు



మెట్లు, ర్యాంపు తొలగించాలని వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కృష్ణవేణికి ఇచ్చిన నోటీసు

విచారణ నేటికి పొడిగింపు

నెల్లూరు (టౌన్): నగరంలోని భక్తవత్సలనగర్‌లోని కేవన్నార్ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది సన్‌షేడ్ కూలి 9వ తరగతి చదువుతున్న గురు మహేంద్ర మృతి చెందిన ఘటనపై సోమవారానికి విచారణను పొడిగించారు. బాలుడి మృతి కారణంగా శనివారం పాఠశాలకు సెలవు ప్రకటించడం, ఆదివారం సెలవు దినం కావడంతో ఎవరూ అందుబాటులో లేరన్న కారణంతో విచారణను పొడిగించారు. విద్యార్థి తల్లిదండ్రులు సైతం ఓజిలిలో ఉన్నారు. సోమవారం రోజు ఉపాధ్యాయులు, గురుమహేంద్ర స్నేహితులు, క్లాస్‌మెట్స్, హెడ్‌మాస్టరు తదితరులు అందుబాటులో ఉంటారు. సాయంత్రానికి ఎట్టి పరిస్థితుల్లో నివేదికను అందజేయాలని డీఈఓ రామారావు ఆదేశించారు. ఇప్పటికే డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మితో పాటు ఇద్దరు సహాయకులు బాలుడి మృతిపై ప్రాథమికంగా విచారణ చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత గురుమహేంద్ర ఇంటికి వెళ్లకుండా అటు వైపు ఎందుకు వెళ్లాడు, బాలుడితో పాటు ఇంకెవరైనా విద్యార్థులు కూడా వెళ్లారా అనే విషయాలపై ఆరా తీయనున్నారు. సాధారణంగా పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులు ఇంటికి వెళ్తుంటారు. ఇందుకు భిన్నంగా నిర్మాణంలో ఉన్న తరగతి గది వైపు ఎందుకు వెళ్లాడన్న దానిపై విచారించనున్నారు. వేర్వేరుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌ను వివరాలను అడిగి తెలుసుకోనున్నారు. కాగా విద్యార్థి మృతితో పాఠశాలకు సెలవు ఇచ్చిన విషయం జిల్లా విద్యాశాఖాధికారికి తెలియక పోవడం గమనార్హం.



నిబంధనలకు తూట్లు పొడుస్తున్న భవన యజమానులు

- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- ప్లాన్‌లో ఒకలా.. నిర్మాణం మరోకలా
- అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ కరువు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

అవినీతి పునాదులపై.. బహుళఅంతస్తులు



గుప్తాపార్కు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం

టౌన్ ప్లానింగ్ అధికారుల ధనదాహం.. యజమానుల కక్కుర్తి వెరసి అవినీతి పునాదులపై బహుళఅంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. పట్టణాభివృద్ధి, భవన నిర్మాణ అనుమతులను కొంత మంది అధికారులు, ప్రజాప్రతినిధులు తమ ఆదాయ వనరులుగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. జీ ప్లస్ టు కు అనుమతులు తీసుకుని మూడు, నాలుగు అంతస్తుల భవన నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానిక అధికార పార్టీ నేతల అండదండలున్న నిర్మాణాల వైపు అధికారులు వెళ్లకపోవడం గమనార్హం. చేతులు తడిపితే నిర్మాణ న్యూనత సైతం గాలికొదిలేస్తున్నారు.



44వ డివిజన్ పరిధిలోని ఆచారివీధిలో మున్సిపల్ ఎంప్లాయీస్ భవనం ఎదురుగా అనుమతి లేకుండా జరుపుతున్న నిర్మాణం

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పరిధిలో ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా మున్సిపల్ కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరి. అయితే నగర పాలక సంస్థ అధికారులు అక్రమాలకు తెర తీయడంతో నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తమకు కాసులు ఇచ్చుకుంటే.. అనుమతులు అక్కర్లేదని, ఎవరైనా వచ్చి అడిగితే జరిమానా వేశారు.. నోటీసులు ఇచ్చారని చెప్పండి అంటూ అధికారులే సలహాలు ఇస్తున్నారంటే ఏ విధంగా అక్రమంగా వసూళ్లు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. నగరంలోని పలు ప్రాంతాల్లో అనుమతులే తీసుకోకుండా బహుళఅంతస్తుల భవంతులు యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. ఓ వైపు అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారుల కొరడా ఝుళిపిస్తుంటే నగర పాలక అధికారుల తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. నగర పాలకలోని ఆయా శాఖల్లో జరుగుతున్న అక్రమాలు, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు వాటిని జియోలాజికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్)తో అనుసంధానం చేశారు. దీంతో పట్టణాల్లో రహదారులు, భవనాలు, కాలువలు, ఖాళీ స్థలాలు వంటి 42 అంశాలు ఎక్కడెక్కడ ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో సమాచారం ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. అయితే టౌన్ ప్లానింగ్ విభాగానికి వెళ్లి పట్టణంలో ఎన్ని ప్లాన్లకు అప్రూవల్ ఇచ్చారు? అనుమతులు లేని భవనాలు ఎన్ని, నోటీసులు ఎన్ని జారీ చేశారు? వంటి వివరాలపై ఆరా తీస్తే మాత్రం సమాధానం లేని పరిస్థితి నెలకొంది.

ధనార్జనే లక్ష్యం.. భద్రత శూన్యం

అనుమతులు లేకుండానే పలువురు బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు చేపట్టినవి అనేకం ఉన్నాయి. ఇటువంటి వాటికి న్యాయస్థాన సూచనలతో నిర్మాణదారుల నుంచి జరిమానా మాత్రమే వసూలు చేస్తున్నారు. ప్లాన్‌లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా ఉన్నా ఆయా నిర్మాణాల స్థాయిని బట్టి అధికారులు ముడుపులు తీసుకుంటున్నారని బాహాటంగానే చెబుతున్నారు. అనుకుని ప్రమాదం జరిగితే అగ్నిమాపక శకటం వెళ్లేందుకు కూడా వీల్లేని పరిస్థితుల్లో కొన్ని భవనాలు ఉన్నాయి.

ప్లాన్‌కు భిన్నంగా...

- నగరంలోని 47వ డివిజన్, గుప్తాపార్కు సమీపంలోని సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ పక్కనే ఉన్న సవరాలవీధిలో జీప్లస్ టు నిర్మాణానికి అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా జీప్లస్‌త్రీ నిర్మాణాన్ని పూర్తి చేశారు. రోడ్డు వైడింగ్‌కు 10 అడుగులు కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్ చేశారు. అయితే ఆ పది అడుగులు కూడా కలుపుకుని జీప్లస్ త్రీ నిర్మాణం చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణంపై స్థానికులు కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎల్‌బీఎస్ ఇంజినీర్ ద్వారా టౌన్‌ప్లానింగ్‌లోని కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు భారీ ముడుపులు అందాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- 44వ డివిజన్ ఆచారివీధి, మున్సిపల్ ఎంప్లాయీస్ భవనం ఎదురుగా ఉన్న డాక్టర్ సుబ్బలక్ష్మి హాస్పిటల్ పక్కనే నూతనంగా నిర్మాణం చేపట్టారు. అయితే ఈ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవు. అయినా కూడా రాత్రి, పగలు తేడా లేకుండా నిర్విరామంగా యంత్రాలు పెట్టి చకచకా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇక్కడి ప్రాంతంలో మాస్టర్ ప్లాన్ ప్రకారంగా 60 అడుగుల వెడల్పు రోడ్డు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉంది. అయితే ఇక్కడి ప్రాంతంలో ఎవరైనా నూతనంగా భవన నిర్మాణాన్ని చేపట్టాలంటే సదరు యజమాని స్థలంలో నుంచి 20 అడుగులు రోడ్డు వైడింగ్ కోసం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన అనంతరం ప్లాన్‌కు అనుమతులు తీసుకోవాలి. అలాంటిదేమీ లేకుండానే సెల్లార్ కోసం 10 అడుగుల మేరు లోతుకు తవ్వేశారు. స్థలం విస్తీర్ణం 100 అంకణాలకు పైగా ఉంది. ఈ స్థలంలో వంద శాతం జరిగే నిర్మాణానికి సంబంధించి కార్పొరేషన్‌లో ఎలాంటి దరఖాస్తు చేయలేదని సమాచారం.
- 44వ డివిజన్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా ఓ భవన నిర్మాణం జరుగుతోంది. దీనికి కూడా ఎలాంటి అనుమతులు తీసుకోలేదని సమాచారం. వాస్తవంగా ఇక్కడి ప్రాంతంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల రోడ్డు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 45 అడుగుల రోడ్డు విస్తీర్ణం మాత్రమే ఉంది. ఈ ప్రాంతంలో భవన నిర్మాణాన్ని చేపట్టాలంటే సదరు యజమాని స్థలంలో రోడ్డు వైడింగ్ కోసం 25 అడుగులకు పైగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సి ఉంది. అనంతరం ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఒకసారి రోడ్డు వైడింగ్ కోసం కార్పొరేషన్ కమిషనర్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తే ఆ స్థలంలో ఎలాంటి హక్కు సదరు స్థల యజమానికి ఉండదు. పూర్తి హక్కు కార్పొరేషన్‌కే ఉంటుంది. అయితే ఇవన్నీ ఏమీ లేకుండానే స్థలం పూర్తిగా (వంద శాతం) నిర్మాణం కొనసాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

నెల్లూరు నగర ప్రధాన కేంద్రంలోని పలు ప్రాంతాల్లో అంకణం రూ. లక్షల్లో పలుకుతుంది. దీంతో అక్కడ స్థలాలున్న యజమానులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. సంబంధిత అధికారులకు సదరు యజమానులు ముడుపులు ముట్టజెప్పడంతో పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు యజమానులు సెల్లార్లు తవ్వి మూడు నుంచి ఆరు అంతస్తుల వరకు నిర్మించి టూలెట్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. బహుళ అంతస్తులు నిర్మించిన యజమానులు సెల్లార్లలోనూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇందుకు కార్పొరేషన్‌కు కమర్షియల్ ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే వారు మాత్రం సెల్లార్‌ను పార్కింగ్‌గా చూపుతూ నగర పాలక సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇకనైనా ఇటీవల కొత్తగా వచ్చిన కమిషనర్ నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అక్రమ భవన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకట్ట వేసేలా తగు చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటా



నగర పాలక సంస్థ పరిధిలో నూతనంగా భవన నిర్మాణాలు చేపట్టాలంటే అనుమతులు తప్పనిసరి. భవన నిర్మాణాలు నియమ నిబంధనల మేరకే జరగాలి. ఎక్కడైతే అనుతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు జరుపుతున్నారో వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. టౌన్ ప్లానింగ్‌పై దృష్టి పెడతాను. అనుమతులు లేకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాను.

– సూర్యతేజ, కమిషనర్, నెల్లూరు నగర పాలక సంస్థ

క్లుప్తంగా

రాంగ్‌రూట్‌లో వెళ్లి బైక్‌ను ఢీకొని..

• వ్యక్తి దుర్మరణం

నెల్లూరు(క్రైమ్): రాంగ్‌రూట్‌లో వెళ్లి మోటార్ బైక్‌ను ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరు బోడిగాడితోట సమీపంలో ఆదివారం జరిగింది. నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. స్టోన్‌హౌస్‌పేటకు చెందిన వెంకట ఆంజనేయ ప్రవీణ్‌కుమార్ (35) చికెన్ మసాలా సంస్థ డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. ఆయన ఆదివారం కోవూరులోని స్నేహితుడి ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. బోడిగాడితోట సమీపంలో మైపాడుగేటు వైపు రాంగ్ రూట్‌లో వెళ్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు గాయమై మృతిచెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై శివశంకర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వచ్చేనెలలో తిరుమలలో విశేష ఉత్సవాలు

తిరుమల: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుమలలో ఆగస్టులో నిర్వహించే విశేష ఉత్సవాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 4న శ్రీ చక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం, శ్రీ ప్రతివాది భయంకర అణ్ణంగరాచార్య వర్ష తిరునక్షత్రం, 7న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేపు, 9న గరుడ పంచమి, తిరుమల శ్రీవారి గరుడ సేవ, 10న కల్కి జయంతి, 13న తరిగొండ వెంగమాంబ వర్ధంతి, 14న తిరుమల శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ, 15 నుంచి 17వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు, 16న వరలక్ష్మీ వ్రతం, నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం, 19న శ్రావణపౌర్ణమి, పౌర్ణమి గరుడ సేవ, రాఖీ పండుగ, హయగ్రీవ జయంతి, విఖానస మహాముని జయంతి, 20న తిరుమల శ్రీవారు శ్రీ విఖానసాచార్య స్వామి సన్నిధికి వేంచేపు, గాయత్రీ జపం, 27న శ్రీకృష్ణాష్టమి, తిరుమల శ్రీవారి ఆస్థానం, 28న శ్రీవారి శిక్యోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

బంగారం, నగదు చోరీ

చిల్లకూరు: మండల కేంద్రమైన చిల్లకూరులోని కోకోలు గార్డెన్ పరిధిలో ఉన్న ఇంట్లో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కోకోలు గార్డెన్‌లో నివాసం ఉండే శ్రీనివాసులు కుటుంబంతో కలిసి శనివారం ఊరికి వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడాన్ని చూసి లోపలికి వెళ్లి పరిశీలించారు. బీరువాలోని బంగారు ఉంగరం, జత బుట్ట కమ్మలు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుధీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రెండు వర్గాల మధ్య గొడవ

సూళ్లూరుపేట: పట్టణంలోని కోళ్లమిట్ట ప్రాంతానికి చెందిన రెండు వర్గాల వారు పరస్పరం గొడవ పడ్డారు. ఇందులో సాయి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై కె.రహీంరెడ్డి కథనం మేరకు.. కోళ్లమిట్టకు చెందిన గౌతమ్, సాయి మధ్య ఆర్థిక పరమైన లావాదేవీల విషయంలో 2023లో ఒకరిపై ఒకరు దాడి చేసుకుని కేసుల వరకూ వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఓ బిర్యానీ పాయింట్ వద్ద గౌతమ్, అతని స్నేహితులుండగా సాయి గొడవలకు కవ్వించాడు. వెంటనే గౌతమ్ కర్రతో సాయిపై దాడి చేశాడు. దీంతో వివాదం పెరిగింది. ఈ రెండు గ్రూపుల్లో ఉన్న యువకులు ఆ ప్రాంతంలో బీభత్సం సృష్టించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని కొంతమందిని పట్టుకున్నారు. ఈ రెండు గ్రూపులపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ యువకులు గతంలో ఇలాగే గొడవ పడ్డారని ఎస్సై తెలిపారు.

బస్సు సౌకర్యం కల్పించండి


కోట: మండలంలోని తీరప్రాంత గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కోట నుంచి సిద్ధవరం, గోవిందపల్లి, వాచిల్లదొరువు, కొత్తపట్నం, గోవిందపల్లిపాళేనికి బస్సులు నడిచేవి. నేడు ఆ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఆటోల కోసం వేచి చూడాల్సి వస్తోంది. కోట నుంచి తీరప్రాంత గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని వాకాడు డిపో అధికారులకు వినతిపత్రం అందజేసినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో బస్సులు నడపాలని ప్రజా ప్రతినిధులు ఆదేశిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజలు, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 115
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 234
లేయర్ చికెన్	: 170

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.35
పండ్లు	: రూ.25

అమ్మో.. మృగాళ్లు



బాలికలపై పెరిగిన అఘాయిత్యాలు

• కూటమి ప్రభుత్వంలో కొరవడిన భద్రత
• తాజాగా కావలిలో 9 ఏళ్ల ఆడబిడ్డపై లైంగికదాడి
• బయటకు రానివెన్నో..

ఆ ఊర్లో ఇంటి పక్కనుండే వ్యక్తి చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మరో జిల్లాలో 50 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి తొమ్మిదేళ్ల బాలికపై లైంగికదాడి చేశాడు. ఇంకో చోట ఆరో తరగతి చదువుతున్న అమ్మాయి బడి నుంచి వస్తుండగా కామాంధులు అకృత్యానికి ఒడిగట్టారు. కొద్దిరోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఇలాంటి ఘటనల గురించి ప్రజలు తరచూ వింటూనే ఉన్నారు. ఆడబిడ్డల వైపు చూడాలంటే భయపడేలా చేస్తామని ఇప్పటి పాలకులు చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో చూస్తే పరిస్థితులు మాత్రం ఆందోళనకరంగా ఉన్నాయి.

నెల్లూరు(క్రైమ్): బాలికలపై లైంగికదాడులు పెరిగాయి. రక్త సంబంధీకులు, సమీప బంధువులు, తెలిసిన వారి పైశాచికత్వానికి బలైపోతున్న వారు ఎందరో ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ తరహా ఉదంతాలు జిల్లాలో తరచూ చోటుచేసుకుంటున్నాయి. అమాయకులైన ఆడపిల్లలపై అయిన వారే అఘాయిత్యాలకు ఒడిగట్టడం సభ్యసమాజాన్ని తలదించుకునేలా చేస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు పాఠశాలలకు పంపితే కొందరు ఉపాధ్యాయులు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. వృద్ధులు మనుమరాలి వయస్సున్న వారిపై అకృత్యాలు తెగబడుతున్నారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వారే కామంతో కళ్లు మూసుకుపోయి చిన్నారులను చిదిమేస్తున్న ఘటనలున్నాయి. వినడానికే జుగుప్స కలిగిస్తున్న ఇలాంటి ఘటనలు జిల్లాలో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం ఆడబిడ్డలకు ఇంటా.. బయట రక్షణ కొరవడింది. తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను ఇలాంటి ఘటనలు చాటి చెబుతున్నాయి.

వెలుగులోకి రానివెన్నో?

బయట ప్రపంచానికి తెలియని ఘటనలు అనేకం ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాది పోలీసు రికార్డుల్లో సుమారు 42 కేసులు నమోదుకాగా అంతకు రెట్టింపు అఘాయిత్యాలు జరిగినట్లు తెలుస్తోంది. బాధను భరించలేని వారు పోలీసులను ఆశ్రయిస్తుండగా పరువు పోతుందని భయపడినవారు బయటకు చెప్పుకోవడం లేదు. ఇతరులకు తెలిస్తే తమ బిడ్డ జీవితం నాశనం అవుతుందని, తలెత్తుకు తిరగలేమని భావించి మిన్నకుండిపోతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

లైంగికదాడులు, వేధింపులు అధికమవడం.. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడం.. తదితర పరిస్థితుల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ ఆడబిడ్డలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లలు ఏ విషయాన్నైనా తమతో పంచుకొనేలా వారిని తీర్చిదిద్దాలి. వారితో అధిక సమయం గడపాలి. స్నేహపూర్వకంగా మెలగాలి. పాఠశాలలు, ట్యూషన్లకు పంపే సమయంలో పలు అంశాలను గమనించాలి. సాయంత్రం వారు స్కూల్ నుంచి ఇంటికి తిరిగొచ్చాక ఆడుకునే సమయంలో ఎక్కడెక్కడకు వెళ్తున్నారు? ఎవరైనా వారిని వెంబడిస్తున్నారా? అనే విషయాలను గమనించాలి. అపరిచితులు, ఆకతాయిలు ఆట పట్టించినా.. అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బందులు పెట్టినా వెంటనే తమ దృష్టికి తీసుకొచ్చేలా తర్ఫీదు ఇవ్వాలి. ఆడపిల్లలు తమను తాము రక్షించుకునేందుకు అవసరమైన ఆత్మరక్షణ విద్యలు నేర్పాలి. పిల్లలపై అతిగా ప్రేమ చూపిస్తున్నట్లు నటించే వారిపై కన్నేసి ఉంచాలి. అప్పుడే అఘాయిత్యాల నుంచి కాపాడొచ్చు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబసభ్యులకు, డయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేసేలా వారికి సూచించాలి.

ఇలా చేయాలి

అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సి ఉంది. లైంగిక వేధింపులు, బాలల హక్కుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. బాలికలకు మంచి, చెడు (గుడ్/బ్యాడ్ టచ్‌లు) స్పర్శలు తదితర విషయాలపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం పెంపొందించాలి. అనుకోని పరిస్థితులు ఎదురైతే ఎలా అప్రమత్తం కావాలి? ఎలా ప్రతిఘటించాలనే అంశాలను వివరించాలి.

అమల్లోకి కేంద్ర చట్టాలు

లైంగికదాడులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నూతన చట్టం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం చిన్నారుల బాధిత కేసుల్లో రెండునెలల లోపు దర్యాప్తును పూర్తి చేయాల్సి ఉంటుంది. గరిష్టంగా రెండు వాయిదాలకు మించి ఉండకూడదు. పోలీసులే బాధితుల వద్దకు వచ్చి ఫిర్యాదు తీసుకునే వెసులుబాటు నూతన చట్టం ద్వారా కల్పించారు. లైంగికదాడికి సంబంధించి భారత న్యాయ సంహిత (బీఎస్ఎస్) 63 సెక్షన్‌తో మొదలయ్యే చట్టాలతో నిందితునికి యావజ్జీవ శిక్ష పడే అవకాశం ఉంది. పోక్సో చట్టం అమలు చేసి కేసులు నమోదు చేస్తారు.

ఇటీవల జిల్లాలో జరిగినవి

➡ సర్వేపల్లి నియోజకవర్గంలోని తోటపల్లిగూడూరులో భార్యపై కక్షతో మారుతండ్రి కుమార్తెపై లైంగికదాడి చేశాడు.
➡ నెల్లూరు వెంగళరావ్‌నగర్‌లో ఎనిమిదేళ్ల బాలిక ఇంటి వద్ద ఆడుకుంటుండగా వరుసకు మామయ్య అయ్యే వ్యక్తి, అతని స్నేహితుడు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు.
➡ రాపూరులో దివ్యాంగురాలిపై వృద్ధుడు లైంగికదాడి చేశాడు.
➡ శనివారం కావలి రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని తొమ్మిదేళ్ల బాలికపై 53 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి లైంగికదాడి చేశాడు.

అరికట్టండి


YSR Congress Party
@YSRCParty
.@JaiTDP కూటమి ప్రభుత్వంలో మైనర్ బాలికలపై ఆగని అత్యాచారాలు!

నెల్లూరు జిల్లా కావలి తుఫాన్ నగర్ లో 9 సంవత్సరాల బాలికపై అత్యాచారానికి యత్నించిన మహబూబ్ బాషా

రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ను గాలికి వదిలేసి మీకు మీరు డబ్బా కొట్టుకుంటూ గొప్పలు చెప్పుకోవడం కాదు @ncbn , @PawanKalyan, హోం మంత్రి @Anitha_TDP రాష్ట్రంలో పసిపిల్లల మీద, మైనర్ బాలికల మీద జరుగుతున్న దాడులను అరికట్టండి ముందు.

Translate post

11:36 am · 28 Jul 24 · 1,086 Views

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారులపై లైంగికదాడులు, దాడి యత్నాలు అధికమయ్యాయి. వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. తాజాగా కావలిలో జరిగిన ఘటనపై వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వేదికగా సర్కారు వైఫల్యాన్ని ఎండగట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత సొంత డప్పు మానుకొని రాష్ట్రంలో పసిపిల్లలు, మైనర్ బాలికల మీద జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేసింది.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ద్వారకానాథ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాస్థాయిలో మెన్, ఉమెన్ కేటగిరీల్లో అండర్ -11, 13, 15, 17, 19 సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో బ్యాడ్మింటన్ పోటీలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం మొదలయ్యాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఆరోగ్యంగా ఉండేందుకు చిన్నప్పటి నుంచే క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 180 టీమ్‌లు పాల్గొనడం అభినందనీయమన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు లేకుండా జరిగే పోటీల్లో క్రీడాకారులు పాల్గొనవద్దని సూచించారు. అధికారికంగా నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలన్నారు. అక్టోబర్ నెలలో నెల్లూరులోని అండర్-11 రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తామన్నారు. సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, విజయకుమార్, కోచ్ వెంకటేష్, అసోసియేషన్‌కు చెందిన దూడల సుధాకర్, శ్రీకాంత్, మద్దిపాటి ప్రసాద్‌రావు, రామ్మోహన్‌రావు, తాళ్లపాక వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని స్కిట్ కళాశాల వెనుక వైపు ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే చనిపోయాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాల కోసం ఆరా తీశారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కత్తులతో దాడి

• మనుబోలులో కలకలం


గాయపడిన శశిధర్‌రెడ్డి

మనుబోలు: ఓ యువకుడు ఇంట్లో ఉండగా నలుగురు వ్యక్తులు వెళ్లి అతడిని బయటకు పిలిచి కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మనుబోలులో ఆదివారం జరిగింది. ఈ ఘటన మనుబోలులో కలకలం సృష్టించింది. పోలీసుల కథనం మేరకు.. మనుబోలు పడమటివీధిలో రైతు మొలకల హరనాథ్‌రెడ్డి నివాసమున్నాడు. అతని కుమారుడు శశిధర్‌రెడ్డి అక్కడే ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం నలుగురు యువకులు బైక్, స్కూటీపై గ్రామానికి వచ్చారు. శశిధర్‌రెడ్డి ఇంటి చిరునామా తెలుసుకుని అక్కడికి వెళ్లారు. శశిధర్‌రెడ్డిని బయటకు పిలిచి ఒక్కసారిగా కత్తులతో దాడి చేశారు. అడ్డుకోబోయిన హరనాథ్‌రెడ్డిని తోసివేశారు. శశిధర్‌కు మెడ, ఛాతి, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. దాడి చేసిన యువకులను శశిధర్‌రెడ్డి తల్లి ఊరైన వెందోడుకి చెందిన వారిగా గుర్తించారు. ఆర్థిక లావాదేవీలతో తలెత్తిన వివాదాల నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లుగా చెబుతున్నారు. సదరు యువకులు వచ్చిన బైక్‌కు సంబంధించి తాళం కనిపించకపోవడంతో దానిని అక్కడే వదిలేసి ఒకే స్కూటీపై పారిపోయారు. ఘటన జరిగిన వీధిలో సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.


సీసీ టీవీ ఫుటేజీలో నిందితులు

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ఆత్మకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన కళాశాలల్లో పనిచేసే సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని స్టడీ సెంటర్ ఉద్యోగ సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వర్సిటీకి ఏపీలో 76 స్టడీ సెంటర్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం పది సంవత్సరాలపాటు ఉమ్మడి రాజధాని ఉండేలా నిర్ణయం కావడంతో ఈ ఏడాది వరకు రెండు రాష్ట్రాల్లో స్టడీ సెంటర్లు ఒకేగా కొనసాగాయన్నారు. అయితే 2024 – 25 విద్యా సంవత్సరం నుంచి ఏపీలో అడ్మిషన్లు నిలిపివేస్తున్నట్లు హైదరాబాద్‌లోని వర్సిటీ నుంచి సమాచారం వచ్చిందన్నారు. ఎంతోమంది ఇందులో డిగ్రీ కోర్సులు పూర్తి చేశారని, ప్రస్తుతం చాలామంది డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు నిలుపుదల చేయడం, విభజన చట్టం ప్రకారం ఏపీకి తమ యూనివర్సిటీతో సంబంధం లేదనే తీరులో ప్రకటన చేయడంతో 76 స్టడీ సెంటర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెండింగ్‌లో ఉంచారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఇక్కడ స్థాపించాలని కోరారు.

మైకా గనులను ముంచేశారు!

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మూతపడిన మైకా పరిశ్రమ

• కూటమి ప్రభుత్వ ఆదేశాలతోనే..
• వీధిన పడిన 30 వేల మంది కార్మికులు
• ప్రభుత్వానికి రూ.500 కోట్లపైనే నష్టం


మూతపడిన ఓపెన్ క్వారీ

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి సర్కారు దెబ్బకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మైకా పరిశ్రమ కుదేలైంది. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే ఈ పరిశ్రమ దెబ్బతినింది. గత నెల 12వ తేదీ నుంచి కొన్ని మైన్లను ఆపగా, ఈనెలలో మిగిలిన వాటిని కూడా పూర్తిగా నిలిపివేశారు. దీంతో వాటిపై ఆధారపడిన వారంతా వీధినపడ్డారు. ప్రభుత్వానికి సైతం రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

30 వేల మంది

ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలో గతంలో 143 గనులు పనిచేస్తుండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 40కి చేరింది. ఈ ప్రాంతంలో దొరికే మైకా, క్రాస్ సిర ధాతువు, ఫల్స్‌ఫర్‌కు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో యువ పారిశ్రామికవేత్తలు ఈ పరిశ్రమలోకి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వ ఆదేశాలతో మైకా, క్రాస్ సిర ధాతువు పరిశ్రమలు మూతబడ్డాయి. వెంకటగిరితో పాటు గూడూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో మైకా గనులు విస్తారంగా ఉన్నాయి. ఆ నియోజకవర్గాల్లోని గూడూరు, సైదాపురం, పొదలకూరు మండలాల్లో మైకా, క్వార్ట్జ్, పల్స్‌ఫర్ లాంటి ఖనిజాలు లభ్యమవుతున్నాయి. ఈ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది కార్మికులకు ఉపాధి లభిస్తోంది. ఈ క్రమంలో ఈ ప్రాంతాన్ని ఆర్థిక జోన్‌గా వ్యవహరించేవారు. మైకా పరిశ్రమపై ఆధారపడి కొన్ని ప్రత్యామ్నాయ పరిశ్రమలనూ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. పల్స్‌ఫర్ ఖనిజం ఇక్కడ లభ్యమవుతుండడంతో సిరామిక్ టైల్స్ ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యాయి. గడిచిన 20 రోజులుగా గనులను మూసివేయడంతో రవాణాతోపాటు మైనింగ్ ఆపరేషన్ పనులు కూడా నిలిచిపోయాయి. దీంతో ఫ్యాక్టరీలకు ముడిసరుకైన పల్స్‌ఫర్ ఖనిజం రవాణా కావడం లేదు.

పాపం కూలీలు

ఒక్క సైదాపురం మండలంలోనే సుమారు 25 వేల మంది కార్మికులు ఈ పరిశ్రమలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ లభించే ఖనిజాన్ని దేశవిదేశాలకు నిత్యం తరలించేవారు. ఇప్పుడు ఆ గనులన్నీ మూతపడడంతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. వాహన యాజమానులతోపాటు.. లోడింగ్ చేసే కూలీలకు కూడా ఉపాధి కరువైంది. వారంతా వలసలు వెళ్లే పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్వహించే మైనింగ్ ఆపరేషన్ పూర్తిగా నిలిచిపోవడంతో ఏం చేయాలో పాలుపోక యజమానులు సతమతమవుతున్నారు. అన్ని అనుమతులున్న గనుల యాజమానులు కూడా తామేం చేశామంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. నిత్యం గనిలో ఉండే పనులను కాంట్రాక్ట్ రూపంలో పనులు చేసుకుని ఆనందంగా జీవనం సాగించే కుటుంబాల్లో కూడా అలజడి మొదలైంది. పనుల్లేక వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మైకా పరిశ్రమలు నిలిపివేయడంతో ప్రభుత్వానికి రూ.500 కోట్ల మేర నష్టంతోపాటు రావాల్సిన రాయల్టీలకూ నష్టం వాటిల్లింది. ప్రధానంగా క్రయవిక్రయాల కారణంగా వ్యాపారులు చెల్లించే జీఎస్టీకి భారీగా కోత పడింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మైకా పరిశ్రమపై కక్ష వీడి.. 30 వేల మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని వారు కోరుతున్నారు.


పొడర్ చేస్తున్న దృశ్యం (ఫైల్)


ఖనిజాన్ని శుద్ధి చేస్తున్న కార్మికులు (ఫైల్)

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ఒకే సం॥లో Inter, 10th పాస్! దూర విద్య ద్వారా BA, B.Com, B.Sc,BBA, MA, M.Com, M.Sc,MSW. MBA, MCA, B.LISC, M.LISC. శ్రీభారతి,నెల్లూరు.సంప్రదించండి.9441553070. [NA-6534]

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-2201]

■10th లేదా Inter ఒకే సం//లో పూర్తిచేసు కోవచ్చు BA, B.Com, BSc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS ✆ 9030030126. [T-2202]

REAL ESTATE

■నారాయణ హాస్పిటల్ దగ్గర 2BHK, పార్థసారథి ప్లాట్-17,జనచైతన్య ప్లాట్-10A, గుండ్లపాళెంలో రోడ్ బిట్, సత్యంజీ A-బ్లాక్‌లో-50, మోడరన్ లేఅవుట్‌లో ప్లాట్-20A. సంప్ర: 9866410052. [N-1249387]

PLOT FOR SALE

■East Facing 33 Ankanams, 40x60 Narayana Engineering College, Opp : VBR Inter National School, Nellore. Ph : 99637 20091 [V- 2641]

■E/F,60 Ank., 48x90 4th Cross West of Vedayapalem center or 3rd Cross East of Podalakuru Road Saibaba Temple, Nellore. Ph : 99637 20091 [V- 2642]

■శరవేగంగా అభివృద్ధి చెందుతున్న చెముడుగుంట ఈనాడు ఆఫీసు ఎదురుగా కలిగిన (Rera & Nuda) 25,33,50 అం॥ల ప్లాట్స్ అమ్మకానికి కలవు. 70% బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. హారిక హోమ్ లోన్స్.సెల్ : 94418 22712. [NA-23625]

TO-LET

■Flat No: 302 (3HK - Duplex), MC Homes Apartment, Saraswathi Nagar (Near Maguntalayout Underbridge, Nellore). Contact: 94409 76555, 94421 02516. [NA-6532]

SERVICES

TOURS & TRAVELS

■కార్తీక పౌర్ణమి సందర్భముగా కాశీయాత్ర 12-11-2024, 16రో॥ నైమిశారణ్యం, అయోధ్య, అలహాబాద్, కాశీలో 9రో॥, 3రో॥ నిద్ర సౌకర్యం కలదు. టి॥ఒక్కొంటికి 25k, 15k, S.T. ట్రావెల్స్. 9885853240, 8686055766 [G-9504]

ప్రకటన గోరంత
స్పందన కొండంత

WANTED

■Wanted Tally Accountant (Male) 2 Years Experience, Cashier (Male) with Computer Knowledge. Time : 10am to 8pm. Contact: 70137 87779, 93916 88723. [NA-5405]

■ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రం హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-28 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 81218 18692 [M-1185369]

■సప్లయర్స్ కావలెను. కావలి పట్టణంలో హోటల్లో పని చేయుటకు సప్లయర్స్ కావలెను. ఫుల్ టైం అండ్ పార్ట్‌టైం. వివరములకు సంప్రదించండి : 63093 29032, 99489 52808. [N-1246195]

■కావలిలో టిఫిన్ తయారుచేయుటకు వంట మాస్టర్, టీ తయారు చేయుటకు టీ మాస్టర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం వెంటనే సంప్రదించండి.Ch.కోటేశ్వరరావు.సెల్: 87902 75481. [N-1246143]

■ప్రముఖ ఇనిస్టిట్యూట్ నందు ఇంగ్లీష్ బోధించుటకు అనుభవజ్ఞులైన ట్యూటర్స్ కావలెను మరియు లేడీ రిసెప్షనిస్టు కావలెను. కందుకూరులో సంప్ర॥ ✆ 76010 04697. [O-793744]

■మీ సొంత మండలాల్లోZP హైస్కూల్Govt. Jr. Collegeలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు స్కాట్‌మాస్టర్స్-Mకావలెను.ఏదేనిడిగ్రీ,వ:22-42 లోపు,జీ:18,500, 9573787478, 9059054439. [T-2207]

■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000- 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. Ph : 9014885406 [HA-412]

■AL-Huda Polytechnic College నందు 2024 సం॥ నకు SPOT Admissions జరుగుచున్నవి. వెంటనే సంప్రదించగలరు. ECE, Mechanical, Civil, Computers Dept. నందు B.Tech అర్హత కల్గిన Teaching Faculty కావలెను. సంప్ర: 9912342089, 8500663444. [NA-23537]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.